# మసి తుడిచిన

■ కాశీభట్ల వేణుగోపాల్

త్రాంగ్రా... చైనా టౌన్.
ఎస్ప్లనేడ్ ఈస్ట్ ధర్మతొలా క్రాసింగ్నించి బెంటింక్ట్ స్ట్రీట్ పేవ్‌మెంట్ల మీద... కలకత్తా...

ఓ నాగరికత పొర మీదింకో నాగరికత పొర.

ఓ సంస్కృతి కౌగిట్లో ఇంకో పూర్తి విభిన్న సంస్కృతి- ఏదో అధివాస్తవిక చిత్రంలా.

ఇన్ని వేలమంది చైనా వాళ్ళనిక్కడ్చూస్తుంటే అసలు చైనాలోనే ఉన్నట్టు...

చికూ... చికూ మంటూ మ్యాండలీన్ని మఫుల్ చేసి వాయించినట్టు మ్యాండరీన్ భాష.

"వాళ్ళ చాంద్రమాన సంవత్సరాల్లో జంతువులు మనమే అయినట్టు అనిపిస్తుంది." ప్రసాదం అన్నాడు.

"గీ సాల్ నాది పంది" అని గట్టిగా నవ్వాడు రెడ్డి.

ఎర్ర కొవ్వొత్తులూ... దుడ్డు అగరొత్తులూ... వెదురుబద్దల మీద క్యూనియఫాం రాతలో భవిష్యద్భాష్యాలూ...

హుగ్లీ నది ఒడ్డున అచీపూర్‌లో గుర్రపు నాడా ఆకారంలో అచ్యూ సమాధి...

ఇరుకూ... మురికీ... బురదా... రొచ్చూ, మనుషుల వింత వాసనా.

"అసలు బెంగాలీలు తీవ్ర సంప్రదాయవాదులు..." నా మాట పూర్తికాక మునుపే-

"సంప్రదాయ తీవ్రవాదులు... ఛీ..." అన్నాడు రెడ్డి.

వాడి వైపు కోపంగా చూడబోయి, వాడి భాషలో విరుపును మెచ్చుకుని...

'సెహబాష్' అన్నట్టు వాడి మణికట్టు మీద తట్టి...

"అటువంటి సంప్రదాయవాదుల మధ్య ఇరుక్కుని వీళ్ళ సంస్కృతిని వీళ్ళు కాపాడుకోవడం చాలా అభినందించతగ్గ విషయం" అన్నాను.

"యు నో? దే ఈవెన్హావె న్యూస్పేపర్ఫార్దెం సెల్వ్స్." కృష్ణ అన్నాడు.

"వీన్నడుగుంగ్రడి ఇస్టరీ మొత్తం ఇన్పిస్తడు... గీన్నెగా ఎర్రంగోడులే? బెనర్జీగాడు... వాన్తాన దోసాల్ షాగిర్దీ జేసిండీడు..." రెడ్డి.

"షట్యువర్ మౌత్... పీఎచ్డీ చేసి కూడా వీడికింకా ఆ యాస పోలే." కోపంగా అన్నాడు కృష్ణుడు.

"హో హ హో... మిట్టీ కా ఖుష్బూ" అని ఇంకా గట్టిగా నవ్వాడు రెడ్డి.

కృష్ణుడూ, రెడ్డీ, ప్రసాదం, నేనూ- నల్గురం ఒకే పని మీద కలకత్తా వచ్చాం. వచ్చిన ప్రతిసారీ చైనా టౌన్ వచ్చి స్వచ్ఛమైన చైనీస్ తిండి తినడం మా అలవాటు.

ఇలా బైటికొచ్చిన ప్రతిసారీ నలభై అయిదేళ్ళొచ్చినా మమ్మల్ని మేం మరచిపోయి... చిన్న పిల్లలైపోతాం. మా అందరి కంటే కృష్ణుడికి కలకత్తా పరిచయం ఎక్కువ. అదీకాక వాడు లెఫ్టిస్ట్ భావాలున్నవాడు. అదీ రెడ్డిగాడి ఎకసెక్కెం.

రెడ్డి తన తెలంగాణ యాస లేకుండా కూడా మాట్లాడగల్డు, కానీ ఇలా మేం మాత్రం మాకైనప్పుడు వాడు తన సహజత్వానికి దూరం కాడు. అలా మాట్లాడినప్పుడు, "పొలంల సింత సెట్టు కింద అమ్మ పక్కన పండి కచ్చా మక్కా దానా నమిలిం తీరుంటదిలే..." అంటాడు. తన గ్రామీణ నేపథ్యాన్ని మరిచిపోడానికిష్టపడ్డు వాడు... ఎవరు మాత్రం బాల్యాన్ని చెరిపేసుకోవాలనుకుంటారు?

ఇంత తన్నుకు చచ్చినా కృష్ణుడు మాత్రం రెడ్డినెవరేనా ఏమైనా అంటే వాళ్ళ మీద యుద్ధానికి సిద్ధమైపోతాడు మళ్ళీ... పిచ్చి స్నేహం వాళ్ళది.

"ఇక్కడో యాంటిక్ షాపుందని కాన్ఫరెన్స్‌లో కల్పన చెప్పింది నిన్న. ఈ రోజు పుడ్డు కొట్టి అక్కడికెళ్దాం." ప్రసాదన్నాడు.

ప్రసాదే కారు డ్రైవ్ చేస్తున్నాడు. ఆ ఇరుకు గల్లీలో పేవ్‌మెంట్ల మీద నిండుగా చెప్పులూ, రకరకాల తోలు వస్తువులు ప్రదర్శనకున్నాయి. శుభసూచకమైన



చిత్రం: నర్సిం

ఎర్ర కాగితపు డ్యాంగ్లర్స్ కంటిని తమ వైపు తిప్పేసుకుంటున్నాయి అయస్కాంతంలా...

మజ్జాన్నపు భోయనం తర్వాత కల్పన చెప్పిన షాపు వెతుక్కుంటూ వెళ్ళాం. ఎంట్రన్స్ చాలా చిన్నగా ఉంది. అసలు మిగిలిన షాపుల అలంకరణలో ఈ షాపు పేరు వెదకడమే కష్టమైంది మాకు. ఎంట్రన్స్ లోంచి పైకి మెట్లున్నై. పదకొండు మెట్లెక్కింతర్వాత చల్లటి ఏసీ గదిలోకొచ్చేశాం. గదేమిటీ పదహారూ, ముప్పై కొల్తల్తో పెద్ద హాలు... చీకటి చీకటిగా... తెలీని పరిమళం ఏదో అక్కడంతా ఆవరించుంది. రకరకాల వస్తువుల్తో నిండి ఉందా హాలు. మసక వెల్తుర్లో ఏవి ఏవో పోల్చుకోడం కష్టంగా ఉంది. అక్కడ ఎవ్వరూ లేరు. చీకటికి కళ్ళు అలవాటుపడ్డానికి కొంచెం సమయం పట్టింది. చాలా భాగం పాలరాతి శిల్పాలూ... మ్యూజికల్ ఇన్స్ట్రుమెంట్స్... పెయింటింగ్స్ ఆక్రమించున్నాయి.

నలుగురం నాలుగు దిక్కులకు కదుల్తుండగా...

"యస్" అన్న శబ్దం నాజూకైన గాబ్లెట్ మీద వేలిగోళ్ళతో మీటినట్టు...

నలుగురి కళ్ళూ ఆ స్వరం వైపునకు తిరిగాయి.

# మానవత్వం



ఖాకీ ట్రౌజర్స్‌లోకి వైట్ కాటన్ షర్ట్ టక్ చేసి, తల నున్నగా నెనక్కి దువ్వి, రబ్బర్ బ్యాండ్ వేసి... చురుకైన కళ్ళతో చూస్తూ ఓ చీనా యువతి... ఎక్కడ్నించొచ్చిందో ఆ హాల్లోకి... ఆమెన్చూడగానే రెడ్డి గొంతులోంచి ఈల లాంటి శబ్దం బైటికొచ్చింది.

"వియ్ హార్డబౌట్యూ... జస్ వాన్న గో అరౌండ్." ప్రసాదన్నాడు.

ఓ చేయి జాచి, ఇంకో చేయి గుండెకు చేర్చి తల వంచి, "వెల్కం ప్లీజ్" అందా అమ్మాయి.

రెడ్డి నా పక్కనే ఉన్నాడు.

"ఏ మస్త్ గున్నదిలే పోరి?" గునగునగా అన్నాడు.

"నీ కూతురు వసంత వయసుంటుందా అమ్మాయికి." ఎప్పుడొచ్చాడో కృష్ణుడు మా పక్కకి...

"ఏయ్ తీ. షర్బత్ల ఉచ్చల్పోసేతోన్వి నువ్వు." నవ్వుతూ అన్నాడు రెడ్డి.

ప్రసాదు ఓ వయొలీన్ని చూస్తున్నాడు...

"ఒరీజినల్ ఆమాటీ... సెవెన్టీన్త్ సెంచురీ... హాండ్మేడ్ బై నికోలా హింసెల్ఫ్... స్ట్రింగ్స్ అండ్ ది బో ఆరాల్సో ఒరీజినల్." ఆ అమ్మాయి చెబ్తోంది... ఒరిజినల్లో 'రి'కి దీర్ఘమిస్తూ.

"అన్ దిసీజ్ గ్యార్‌నెరీ... బట్ యూ కాంట్ ప్లే ఆ నిట్..." అనింకో వయొలీన్ని చూపిస్తూ అంది.

"ఆథెంటిసిటీ?" అడిగాడు ప్రసాద్.

"వియ్ వోచ్ ఫరిట్" అంటూ వాళ్ళ వ్యాపారమే నూటేభై సంవత్సరాల వయసుదని అందా అమ్మాయి.

"మీ వద్ద ఉన్న వాటిల్లో అతి పురాతనమైంది ఏది?" కృష్ణుడు అడిగాడా అమ్మాయినింగ్లిష్లో.

ఆ అమ్మాయి చెప్పబోతుండగా 'ధబ్' మని చప్పుడు వినిపించింది.

'అమ్మా' అని రెడ్డి గొంతు...

హాలు మధ్యలో కింద పడున్నాడు రెడ్డి. గబగబా మేమ్ముగ్గురం, ఆ అమ్మాయీ వాడి దగ్గరికెళ్ళాం.

హాలు మధ్యలో చిన్న గట్టు లాంటిదుంది. సిమెంట్ దిమ్మె... దాని మీద ఏ విగ్రహమో పెట్టుంటారు... అమ్మేసింతర్వాత ఆ దిమ్మె అలాగే ఉంది. ఆ మసక చీకటిలో రెడ్డి దాన్ని తన్నుకొని కింద పడ్డాడు.

"కాలు... కాలు" అంటున్నాడు రెడ్డి.

ఆ అమ్మాయి చురుగ్గా లేచి గోడకున్న ఓ చిన్న రంధ్రంలోంచి ఎవర్నో పిల్చింది. కాస్సేపటికి పొట్టిగా, పీలగా ఉన్న ఓ వృద్ధుడు చేతిలో సంచితో వచ్చాడు. అతను కూడా ఖాకీ ట్రౌజర్స్‌లోకి తెల్ల కాటన్ చొక్కా టక్చేసుకున్నాడు.

మమ్మల్ని చూసి కుడి చేయి గుండెకు చేర్చుకుని వంగి నమస్కారం అన్న సంజ్ఞ చేశాడతను.

రెడ్డి కాలు– మోకాలి కింది భాగం– వాచిపోయింది.

> "ఎన్ని వందల వేల సంవత్స రాల కిందో పశువు మనిషిగా పరిణమిస్తున్న క్షణాన ఆవిర్భ వించిందో... పరిమళించిందో, ఆ పురాతన 'మానవత్వం' మీ సొంతం తల్లీ..."

ఎముక విరిగి పోయుంటుందనుకున్నా. దాన్ని అవునన్నట్టుగా ధ్రువీకరిస్తూ ఆ వృద్ధుడు మా వైపు తిరిగి 'ఫ్రాక్చర్' అన్నాడు. మళ్ళీ ఆ అమ్మాయి వైపు తిరిగి మ్యాండరీన్ భాషలో ఏదో అన్నాడు. ఆ అమ్మాయి తలపంకించి వెళ్ళి ఓ రెణ్ణిమిషాల్తర్వాతొచ్చింది. వచ్చి రెడ్డి కాలుకున్న షూ తీసేసింది. ఆ వృద్ధుడు రెడ్డి పాదాల వేపు కూర్చుని ఆ అమ్మాయికి సైగ చేశాడు. ఆ అమ్మాయి రెడ్డి పక్కన కూర్చుని వాడి మోకాలి పై భాగాన్ని రెండు చేతుల్తో గట్టిగా పట్టుకుంది. బాధగా మూలిగాడు రెడ్డి. ఆ వృద్ధుడు రెడ్డి పాదాన్ని జాగ్రత్తగా పట్టుకుని చటుక్కున లాగాడు.

"అమ్మా" అని గట్టిగా అరిచాడు రెడ్డి.

ఆ అమ్మాయి వాడి నుదుటి మీద చెయ్యేసి, "ఇట్విల్ బి ఆల్‌రైట్" అంది.

ఆ వృద్ధుడు సంచీలోంచి ఓ మూడు వెదురు బద్దలు తీసి కాలికి మూడు వేపులా పెట్టి ఓ టవల్ని మూడు భాగాలుగా నిలువునా చించి రెడ్డి కాలికి కట్టు కట్టాడు. కట్టి, సంచీలోంచి చిన్ని సీసా తీసి ఆ అమ్మాయి కిచ్చి ఏదో చెప్పాడు. ఆ సీసా మూత తీసి రెడ్డి తలెత్తి ఒళ్ళో పెట్టుకుని, వాడి నాసికా రంధ్రాలకు ఆ సీసా వాసన చూపించిందా అమ్మాయి.

ఇదంతా అయ్యేంతలో ఓ ఇద్దరు వ్యక్తులు స్ట్రెచర్ తీసుకువచ్చారు.

మాకు అర్థమైంది. ఆ అమ్మాయి దగ్గర్లోని ఏదో

హాస్పిటల్కి ఫోన్జేసి 'యాంబులెన్స్' పిలిపించిందని.

రెడ్డిని జాగ్రత్తగా స్ట్రెచర్మీదకి చేర్చాం. వచ్చిన వాళ్ళు కదలకుండా బెల్టుల్తో రెడ్డిని బిగించి, నెమ్మదిగా వాడిని కిందికి తీసుకువచ్చి యాంబులెన్స్లోకి చేర్చి మా వైపు తిరిగి, "మాతో వెనకాలే రండి. దగ్గరే నర్సింగ్ హోమ్" అన్నారు బెంగాలీ యాస హిందీలో.

వెనక్కి తిరిగి ప్రసాదు కృతజ్ఞతలు తెలిపాడు. అప్పటికే ఆ అమ్మాయి యాంబులెన్స్లో రెడ్డి పక్కన కూర్చునుంది. కూర్చుని రెడ్డి చేతి మీద చేయి వేసి నవ్వుతూ ఏదో అంటోంది. ఆ చిన్ని ముఖంలో ఏదో అద్భుత తేజస్సు. ఆ వృద్ధుడు గౌతమ బుద్ధుడిలా నవ్వుతూ చెయ్యెత్తి మా వేపు ఆప్యాయంగా చూసి ఆ మెట్ల గుండా ఏవో పైలోకాలకన్నట్లు అదృశ్యమైపోయాడు.

* * *

హాస్పిటల్లో ఎక్స్రే తీసి కాలికి ప్లాస్టర్ వేసి ఏమీ ఫర్వాలేదు వెళ్ళొచ్చు అన్నారు డాక్టర్లు. అంతా అయ్యేవరకూ ఆ చీనా అమ్మాయి రెడ్డి పక్కనే ఉండింది. సరిగ్గా మేం బిల్ పే చేసి బైటికొచ్చేసరికి మాయమైపోయింది. అటూ ఇటూ చాలా సేపు చూశాం. కనిపించలేదు. ఇక తన 'డ్యూటీ' అయిపోయినట్టు వెళ్ళిపోయిందా అమ్మాయి. గెస్ట్హౌస్లో బెడ్ మీద పడుకొని రెడ్డి శూన్యంలోకి చూస్తున్నాడు.

"నీ ప్రపంచమేం కూలిపోలేదు, అలా విషాదపు పోజివ్వక్కర్లేదు." కృష్ణుడు నవ్వుతూ రెడ్డి భుజం తట్టాడు.

తల అడ్డంగా ఊపుతూ, "లెటర్ ప్యాడూ, పెన్నూ ఇవ్వు" అన్నాడు రెడ్డి.

వాడిని డిస్టర్బ్ చేయడం ఇష్టంలేక వరండాలో కూర్చున్నాం, నేనూ, ప్రసాదం, కృష్ణుడూ- మా కార్యక్రమంలోకి మేం రూపాంతర ప్రయాణం చేస్తూ, పరిణామం చెందుతూ.

"వాడేమైనా వేసుకుంటాడేమో అడుగుదాం". అన్నాడు కృష్ణుడు ఓ అరగంట తర్వాత. మాకూ నిజమేననిపించి ముగ్గురం లోపలికెళ్ళాం."

మమ్మల్ని చూడగానే వాడి మొహం విచ్చుకుంది.

ఇంతకు మునుపటి విషాదపు తెర తొలిగిపోయింది. మడత పెట్టిన కాగితాన్ని ప్రసాద్ కిచ్చి, తన సూట్ కేస్లో తన కూతురు వసంతకి కొన్న బెంగాలీ కాటన్ చుడీదార్ ప్యాకెట్ తీయమన్నాకు చెప్పి-

"నా కోసం... వెళ్ళి ఆ అమ్మాయికి ఇచ్చి రండి ఓ బూకేతో పాటు" అన్నాడు.

"చదవచ్చా ఇది?" కృష్ణుడడిగాడు వాణ్ణి.

"బై ఆల్మీన్స్" అన్నాడు రెడ్డి.

ప్రసాదం ఆ ఉత్తరాన్ని మడతలు విప్పి బైటికి చదివాడు. అందమైన ఇంగ్లిష్లో రాసుందా ఉత్తరం. సారాంశమిది:

"ఓ నా చిన్ని దేవతా!"

ఈ నిన్నే నేను అసభ్యమైన వ్యాఖ్యల్తో ఏమో అన్నాను తల్లీ. మీది పురావస్తుశాల అన్నది అక్షరాలా నిజం. అక్కడ విక్రయానికి కాక మీకు మాత్రం సొంతమైనదీ, అత్యంత పురాతనమైనది... ఏ చరిత్రకారులూ తారీఖులు నిర్ణయించలేనంత పురాతనమైంది... ఎన్ని వందల వేల సంవత్సరాల క్రిందో పశువు మనిషిగా పరిణమిస్తున్న క్షణాన ఆవిర్భవించిందో... ప్రకృతి ఒడిలో ఆవిష్కరించబడి, చిగురించి, పరిమళించిందో... ఆ పురాతన 'మానవత్వం' మీ సొంతం తల్లీ...

నన్ను క్షమించి వీటిని స్వీకరించు.


ప్రేమతో
నాన్న..."

ప్రసాదు ఉత్తరం ముగించేప్పటికి మా నలుగురి కళ్ళూ, మనసులూ- రెండూ చెమ్మగిల్లాయి. ■

# కలకాలం నిలిచే కృషి

## ఇరవయ్యో శతాబ్దపు రచయిత్రుల కథలతో ప్రప్రథమ సంకలనం

■ ఎ.ఎ.వి ప్రసాద్



నూరేళ్ళ పంట
సంకలనం: భార్గవీ రావు; ప్రతులకు: ప్రిసం బుక్స్, హైదరాబాద్.
పేజీలు: 601.
వెల: రూ. 400/-

మనిషి అంతశ్చేతనను కంప్యూటర్, టీవీలు శాసిస్తూ, పుస్తక పఠనాసక్తి తగ్గిపోతున్న ఈ రోజుల్లో నాలుగు వందల రూపాయల ధర పెట్టి ఒక కథాసంకలనాన్ని వెలువరించడం నిజంగా సాహసం. అందులోనూ కన్నడం మాతృభాష అయిన సంకలనకర్త భార్గవీ రావు, బెంగుళూరులో ప్రధాన కార్యాలయం ఉన్న ప్రిసం బుక్స్వారు ఈ సాహస కార్యాన్ని చేపట్టడం తెలుగు పాఠకులలో ఆశ్చర్యానందాలతో పాటు కృతజ్ఞతాభావాన్ని రేకెత్తిస్తుంది. పైగా, అచ్చంగా అన్నీ స్త్రీల కథలతోనే నూరేళ్ళ పంట సంకలనాన్ని వెలువరించడం ప్రశంసనీయమైన సాహితీ యత్నం.

ఒక దృశ్యాన్ని పుస్తకంలో వర్ణించినపుడు దాన్ని మనసు తెర మీద ఆవిష్కరించుకోవడానికి పాఠకుడు తన ఊహాశక్తిని ఉపయోగించవలసి ఉంటుంది. అదే సన్నివేశాన్ని టెలివిజన్ తెరపై చూసేటపుడు ప్రేక్షకుడు ఊహాశక్తికి పనిపెట్టాల్సిన అవసరం ఉండదు. అక్కడ అతను చూసేది దర్శకుని ఊహాపటిమే. నూరేళ్ళ పంటలోని కథలు పాఠకుల భావనాశక్తికి పదను పెట్టి, విజ్ఞతను పెంపొందిస్తాయి. టెలివిజన్ మన నాగరికతలో భాగం కాకముందు ఆరుబయట వెన్నెల వెలుగులో అమ్మమ్మ కథ చెప్తుంటే కుతూహలంగా విన్న జ్ఞాపకాలను మళ్ళీ మనోఫలకంపైన ఆవిష్కరించి, "ఎంతటి పురుషపుంగవుడైనా అతడు విన్న మొదటి కథ అమ్మ (లేదా అమ్మమ్మ) చెప్పినదే అయి ఉంటుంది" అని భార్గవీ రావు చేసిన ప్రకటన ముమ్మాటికీ నిజం. అంతేకాదు. 1910లో గురజాడ అప్పారావు రాసిన దిద్దుబాటు మొదటి కథ అనుకోవడం పొరపాటనీ, 1902 లోనే స్త్రీవిద్య అనే కథ రాసిన భండారు అచ్చమాంబ తెలుగులో మొదటి కథకు సృష్టికర్త అనీ సంకలనకర్త సగర్వంగా చాటారు. 20వ శతాబ్దంలో తెలుగు రచయిత్రుల సృజన యజ్ఞానికి అద్దం పట్టే నూరు కథలతో భార్గవీ రావు కూర్పు చేసిన నూరేళ్ళ పంట సంకలనానికి అచ్చమాంబ కథతోనే నాంది పలకడం సముచితంగా ఉంది.

> హృదయం నుంచి మెదడులోకీ, నిస్సహాయత నుంచి అధికారానికీ, స్త్రీత్వం నుంచీ పురుషత్వంలోకీ, పెరగడం మనిషికి తప్పనిసరేమో!

స్వాతంత్ర్యానికి పూర్వం వెలువడిన కథల్లో సహజంగానే ఆనాటి స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి, స్త్రీ విద్య నేర్వవలసిన ఆవశ్యకత ప్రతిఫలించాయి. దేశభక్తిని ప్రబోధించిన కనుపర్తి వరలక్ష్మమ్మ ఐదు మాసములు ఇరువది దినములు కథ దీనికి ఉదాహరణ. స్వాతంత్ర్యానంతరం మహిళల్లో విద్యావ్యాప్తి జరిగి, సమాజంలో సంప్రదాయాల పట్టు క్రమక్రమంగా సడలుతున్న నేపథ్యంలో స్త్రీ స్వతంత్ర వ్యక్తిత్వం సంతరించుకోవడం, ప్రేమానురాగాల పునాదిపై పెళ్ళిళ్ళు జరగాలన్న భావన బలం పుంజుకోవడం ప్రస్ఫుటమైంది. ఇలా ఒక దశాబ్దానికీ మరో దశాబ్దానికీ మధ్య స్త్రీల భావాల్లో వచ్చిన మార్పును రచయిత్రుల కథలు ప్రతిబింబించడంతో పాటు, కొన్ని సందర్భాల్లో మార్పుకు తామే బాట వేశాయి. నూరేళ్ళ పంట సంకలనం ఈ మార్పులకు ప్రతీకలనదగ్గ కథలను సొంతం చేసుకొంది. అయితే, ప్రతి కథ చివర్నో, మొదట్లోనో ఆ కథ ప్రచురితమైన సంవత్సరాన్ని ఇచ్చి ఉంటే తులనాత్మక అధ్యయనం సులభమయ్యేది.

విద్య, ఉద్యోగాల మూలంగా స్త్రీలలో స్వతంత్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోగల శక్తి వికసించి, పటిష్ఠ వ్యక్తిత్వం రూపుదిద్దుకోవడం మాదిరెడ్డి సులోచన హక్కు, ఆదిమధ్యం రమణమ్మ మొగిలిపొత్తి కథల్లో కనిపిస్తుంది. 60వ దశాబ్దం నాటికి రచయిత్రుల కథల్లో వస్తు, శిల్పరీత్యా పరిణతి పెరిగింది. ఒక దశలో ప్రేమ, ఆరాధనకు పట్టం కట్టిన రచనలు రాజ్యమేలాయి. ఈ ఒరవడిలోనే సొరిస్ కథ ఉష మార్మిక వాతావరణంలో నిషిద్ధ ప్రేమను పండించింది. కోడూరి కౌసల్యా దేవి కథ తపోవనం రాజకుమారుడి లాంటి వరుని కోసం తహతహలాడే పడచుల మనస్తత్వాన్ని చక్కగా వర్ణించింది.

పురుషులు వినే మొదటి కథ అమ్మ చెప్పినదే అయివుంటుందనేది ఎంత నిజమో, నేటి స్త్రీవాదులు ద్వేషించే పురుషాధిక్య మనస్తత్వానికి బాల్యంలో బీజం వేసే బాధ్యతను కొంతవరకు స్త్రీలు నిర్వహిస్తారనడమూ అంతే నిజం. పితృస్వామ్య వ్యవస్థలో బందీ అయినంతవరకు స్త్రీ ఇంతకు భిన్నంగా వ్యవహరించే అవకాశం తక్కువ. అయితే, పితృస్వామ్య భావజాల పొరలను ఛేదించి, సమస్యలకు కొత్త పద్ధతిలో పరిష్కారం ప్రతిపాదించే రంగనాయకమ్మ, పాటిబండ్ల రజని, ఓల్గా, కొండేపూడి నిర్మల తదితరుల స్త్రీవాద కథలు ఈ సంకలనాన్ని పరిపుష్టం చేశాయి. ఇందులో కొన్ని కథలు వివాహ-కుటుంబ వ్యవస్థ పరిధిలోనే మహిళలు తమ సమస్యలకు పరిష్కారాలు కనుగొనవచ్చునని సూచిస్తే, మరికొన్ని కథలు కుటుంబ చట్రాన్ని ఛేదించుకొని స్త్రీ ఒంటరిగా జీవించడం ద్వారానే స్వీయత్వాన్ని పరిరక్షించుకోగలదని ప్రతిపాదించాయి. స్త్రీ ఆర్థికంగా స్వతంత్రురాలవుతున్న కొద్దీ, ఇలాంటి ప్రతిపాదనలు ఆచరణలోకి రావడం ఎక్కువవుతుంది.

పారిశ్రామిక విప్లవానంతరం సమాచార విప్లవం విజృంభిస్తున్న నేటి సమాజంలో ఆర్థిక, సాంస్కృతిక పరంగా ఎన్నో మార్పులు సంభవిస్తున్నాయి. ఈ మార్పులు స్త్రీ, పురుష సంప్రదాయ పాత్రలను, స్వభావాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. స్పందించే శక్తి, కరుణ, మమతానురాగాల వంటి స్త్రీత్వ గుణాలను పురుషులు, ఆధిక్య ప్రదర్శనగా మారని స్వతంత్ర పిపాసను స్త్రీలు స్వీకరించడం ద్వారా మారిన కాలానికి అనుగుణమైన సమాజాన్ని సృష్టించగలుగుతారు. నూరేళ్ళ పంట సంకలనంలోని కథల్లో అంతర్లీనంగా ఉన్న సందేశమిదే. ■